

# మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ



**ఆజ్ సజన్ మొహె అంగ్ లగాలో జనమ్ సఫల్ హోజాయే**

**హృదయ్ కి పీడా దేహ్ కి అగ్నీ సబ్ శీతల్ హో జాయే.**

'ప్యాసా' సినిమాలో పాటలన్నీ అత్యద్భుతమైనవే. ఒకో పాట వింటూ ఈ ప్రపంచాన్నే మరచిపోవచ్చు. పాటల బాణీ, వాడిన వాయిద్యాలు, పాడినవారు, పాటలో పదాలు, భావాలు, పాటల చిత్రీకరణ ఇలా ఒకో అంశం గురించి ఎంతెంత చర్చించినా తనివి తీరదు. చూసిన ప్రతిసారీ కొత్త అర్థాలు తెలుస్తూంటాయి. విన్న ప్రతిసారీ అంతవరకూ లేని కొత్త భావం బోధపడుతుంది.

'ప్యాసా' సినిమాలో ప్రతి పాటకూ తీవ్రమైన అభిమానులున్నారు. 'జానే క్యా తూనే కహీ' పాట కోసం ప్రాణాలిస్తారు కొందరు. 'జానె వో కైసే లోగ్ థే ' పాట వింటూ దుఃఖసాగరంలో మునుగుతూ ఆనందపుటలలపై తేలేవారు కొందరు. కానీ ఈ పాటలన్నిటికన్నా అత్యంత ఉన్నత స్థాయిలో ఉండి, తీవ్రమైన ప్రేమ భావనలోని ఆధ్యాత్మికపుటావేశ లోతులను అనుభవానికి తెచ్చే పరమాద్భుతమైన గీతం. 'ఆజ్ సజన్ మోహె అంగ్ లగాలో...'

హిందీ సినీ సంగీత ప్రపంచంలో అతి గొప్ప గేయ రచయిత అనగానే వినిపించేవి రెండే పేర్లు , సాహిర్, శైలేంద్ర. సాహిర్ పాటలలో కఠినమైన 'ఉర్దూ' పదాలు దొర్లుతాయి. శైలేంద్ర పాటలు లలితమైన స్వచ్ఛ గ్రామీణ హిందీ పదాలు, సాహిత్య హిందీ పదాలతో చెలిమి చేస్తూ అత్యంత లోతైన భావాలను అమోఘంగా చెప్తాయి. శైలేంద్రను హిందీ సినీ గేయాల 'కబీర్ 'గా అభివర్ణిస్తారు.

'ఆజ్ సజన్' పాటలో సాహిర్ శుద్ధమూ, స్వచ్ఛమూ, సరళమూ అయిన సాంప్రదాయక హిందీ పదాలను అత్యంత అద్భుతంగా వాడాడు. 'ప్యాసా' కన్నా ముందు 'దేవదాసు' సినిమాలో అతి సరళమైన శుద్ధ హిందీ పదాలతో అతి సుందరమైనరీతిలో రాధ విరహాన్ని చూపే శృంగార భక్తి గీతాన్ని రచించాడు సాహిర్.

అన్ మిలో అన్ మిలో శ్యాం సాంవరే

బ్రిజ్ మే అకేలీ రాధె ఖోయ్ ఖోయ్ ఫిరే

ఎంతో సుందరమైన పల్లవి ఇది.

'వ్రజభూమి'లో రాధ శ్రీకృషుడి కోసం ఎదురు చూస్తోంది. శ్రీకృష్ణుడి విరహాన్ని భరించలేకపోతోంది. అతడి దర్శనం కోసం తపిస్తోంది. దాన్ని వర్ణిస్తూన్న గీతం ఇది. దేవదాసు పట్నం వెళ్తాడు చదువుకోసం. దేవదాసు కోసం తపిస్తున్న పార్వతి కోసం ఈ పాట పాడతారు.

'ఆన్‌మిలో' అంటే 'వచ్చి కలువు' అని అర్థం. శ్రీకృష్ణుడా, ప్రేమికుడా బ్రిజ్‌లో ఒంటరిగా సర్వం కోల్పోయిన దానిలా ఉన్న రాధను వచ్చి కలువు అన్నది పల్లవి.

బెంగాల్ ప్రాంతంలో చైతన్య మహాప్రభు వల్ల వైష్ణవ తత్వ ప్రభావం అధికం. చైతన్య మహాప్రభు గీతాలద్వారా వైష్ణవ భావ ప్రచారం బెంగాల్ నలుమూలలా జరిగింది . చైతన్య మహాప్రభు గీతాల ద్వారా రాధాకృష్ణుల రాసలీలలు, విరహ వేదనల ద్వారా ప్రజలలో ఆధ్యాత్మిక భావనలను చైతన్యవంతం చేశాడు. బెంగాల్‌లో వీటిని బౌల్ (baul) గీతాలంటారు. రాధ, కృష్ణుల విరహవేదనలో. ప్రేమాగ్నిలో ఆధ్యాత్మిక భావనలను ఆరోపించి అతి సుందరంగా రచించిన గీతాలివి. ఆ కాలంలో గాయనీ గాయకులు ఈ పాటలు పాడుతూ దేశమంతా తిరిగి ప్రజలకు రాధాకృష్ణుల తత్వాన్ని వివరించి చైతన్యవంతం చేశారు. 'బౌల్' అంటే ఆధ్యాత్మిక తపనలో తలమునకలయినవారు. 15వ శతాబ్దం ప్రాంతంలో బెంగాల్‌లో ప్రజలు ఆధ్యాత్మికతకు దూరమై ధర్మాన్ని విస్మరిస్తున్న తరుణంలో, ఆధ్యాత్మిక చింతన కల కొందరు గాయనీ గాయకులు జట్లు జట్లుగా ఏర్పడి గ్రామం గ్రామం తిరుగుతూ తమ పాటల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేశారు.

వారికి సంగీతమే ధర్మం. వైష్ణవులు, సహజేయ బౌద్ధులు, సూఫీలు అంతా కలసి ఇలా ధర్మ ప్రచారం చేశారు. చైతన్య మహాప్రభు ఆగమనంతో వీరికి ఒక దిశ దొరికింది. రవీంద్రనాథ్ ఠాగూర్ సైతం ఈ 'బౌల్' గీతాల ప్రభావంతో ఎదిగిన వాడే. ఇప్పటికీ పశ్చిమ బెంగాల్‌లోని గ్రామాలలో కాషాయ వస్త్రాలు ధరించి ఏక్‌తార మ్రోగిస్తూ, మైమరచి గానం చేస్తూ తిరిగే బౌల్ గాయనీ గాయకులు కనిపిస్తారు. 'అన్ మిలో అన్ మిలో' పాట పాడేది కూడా ఇలాంటి 'బౌల్' గాయకులే. పాట బాణీని 'బౌల్' గాయకులు పాడే వైష్ణవ ఆధ్యాత్మిక శృంగార భక్తి గీతాల ప్రభావంతో రూపొందించిందే.

‘ఆజ్ సజన్ మోహే అంగ్ లగాలో జనమ్ సఫల్ హోజాయే’ పాటకూడా ‘బౌల్’ గాయకులు పాడే వైష్ణవ ఆధ్యాత్మిక శృంగార భక్తిగీతాల పంథాలో రూపొందింది. పాటలో భావం, పదాలవాడకం కూడా వీరి సాహిత్యాన్ని అనుసరించే సాగింది.

సినిమాలో సన్నివేశం కూడా చక్కగా కుదిరింది.

నాయిక వేశ్య. హీరో కవి. అతని కవితలు చదివి, అతడితో పరిచయం అవటం వల్ల అతని వ్యక్తిత్వానికి ఆకర్షితురాలయి మౌనంగా అతడిని ప్రేమిస్తూంటుంది నాయిక. కానీ తమ ఇద్దరి నడుమ ఉన్న వ్యత్యాసాల వల్ల ఆ విషయం బహిర్గతం చేయలేకపోతుంది. హీరో ఆమె మనసులోని భావాలు, సంఘర్షణలు గమనించడు. అతడి ధోరణి అతడిది. ఒకరోజు ఓ వ్యక్తి నాయికను కారునుండి తోసేస్తాడు. ఆమెని కాపాడతాడు నాయకుడు. పోలీసు అడిగితే ఆమె తన భార్య అని చెప్తాడు. ఆమె నిర్ఘాంతపోతుంది. ఆమెను పోలీసుల నుంచి రక్షించి తన ఇంటికి వచ్చి మెట్లెక్కుతాడు హీరో. అతని వెంటే వచ్చిన నాయిక మెట్లెక్కలేక, క్రిందనే కూర్చుండిపోతుంది. అతడి మీద ఆమెకు ఉన్న ప్రేమ పోలీసులకు ఆమె తన 'భార్య' అని చెప్పటంతో ఆమెలో పట్టరాని రీతిలో పొంగి ప్రొర్లుతుంది. కానీ తన సామాజిక స్థాయి ఆమెకు తెలుసు. ఈ సందర్భంలో వీధిలో ఈ భక్తి గీతం ఆరంభమవుతుంది.

**సఖీరే, బిరహా కె దుఖడే సహ సహకర్ జబ్ రాధే బేసుద్ హోలీ**

**తొ ఎక్ దిన్ అప్నే మన్‌మోహన్ సే జాకర్ యూన్ బోలీ..**

ఇది పాట ముందు వచ్చే 'సాకీ' లాంటిది.

చెలికత్తెలకు చెప్తోంది పాట పాడే ఆమె. స్నేహితులారా, శ్రీకృష్ణుడి విరహ వేదన కలిగించిన దుఃఖాన్ని సహించీ, సహించీ ఇక సహించలేని పరిస్థితిలో, తట్టుకోలేక ఒక రోజు రాధ కృష్ణుడి దగ్గరకు వెళ్లి అతనితో ఇలా అంది..

సినిమా సందర్భంలో నాయకుడు శ్రీకృష్ణుడు. రాధ మనోవేదనను గమనించడు. నాయిక రాధ. శ్రీకృష్ణుడి పైని ప్రేమను ఆమె వ్యక్తం చేయలేదు. ప్రదర్శించలేదు. కానీ అతని కోసం తపన పడుతూంటుంది. అతడిపైన ప్రేమను వ్యక్తపరచాలని అతడిని తాకటంద్వారా హృదయవేదనను, దేహ తాపాన్ని చల్లార్చుకోవాలనుకుంటూంది. ఇక తట్టుకోలేని దశలో శ్రీకృష్ణుడిని చేరి తన మనసులో మాట చెప్పింది. ఏమని?

**ఆజ్ స సజన్ మోహె అంగ్ లగాలో జనం సఫల్ హోజాయే**

**హృదయ్ కి పీడా, దేహకి అగ్ని సబ్ శీతల్ హోజాయే.**

పాట ముందర 'సాకీ' వస్తున్నప్పుడే, గీతాదత్ స్వరంలోని బాధ, వేదన, ఓ రకమైన విషాదం మనసును కదిలిస్తాయి. గీతాదత్ బెంగాలీ అవటం వల్ల ఆమె హిందీ పదాలు పలకటంలో అప్పుడప్పుడు బెంగాలీ యాస దొర్లుతూ బహు సుందరంగా ఉంటుంది. స్వరంలో అలవికాని ఆర్తి సూటిగా హృదయాన్ని తాకుతుంది.

పాట ఆరంభమవుతూనే ఒక మధురమైన  వేదన మనసును చుట్టేస్తుంది. ముఖ్యంగా 'అంగ్ లగాలో' అనటం ఎంత స్వాభావికంగా ఉంటుందో 'జనమ్  సఫల్ హోజాయే' అనటం అంత ప్రాకృతికంగా ఉంటుంది.  శ్రీ కృష్ణుడి విరహవేదన తట్టుకోలేని రాధ, 'నన్ను ఈరోజు కౌగిలించుకో, నా జన్మ ధన్యమైపోతుంది' అనే దృశ్యం మనసు ఊహించి మధురమైన భావన చుట్టేస్తుంది. గాయని 'హృదయ్‌కి పీడా, దేహకి అగ్ని' అనటంలో ఆయా భావనలు అనుభవానికి వస్తాయి. 'శీతల్' పదం పలుకటంతోటే సాంత్వన కలుగుతుంది 'హోజాయే' నిజంగా 'హోజాయే' అనిపిస్తుంది. హృదయ్, దేహ్ రెండు పదాల వాడకం పాటలో ప్రదర్శితమవుతున్న భావన స్థాయి మామూలు భౌతిక స్థాయి కాదని సూచిస్తుంది. దేహం భౌతికం. హృదయం అభౌతికం. అంటే, భౌతిక పరిధులను దాటి ఆధ్యాత్మిక పొలిమేరల్లో సంచరిస్తున్న ప్రేమ అన్నమాట.

ఈ పాటను దృశ్యం చూడకుండా కళ్లు మూసుకుని వింటే 'శృంగార గీతం'లా అనిపిస్తుంది. కానీ పాట బాణీ, వాయిద్యాలు ఇది శృంగార గీతం కాదు, భక్తి గీతం అని చెప్తూంటాయి. 'బౌల్' గీతాలలో గొప్పతనమే ఇది. విషయం తెలియని వారికి శృంగార గీతం – రాధ విరహ వేదనతో శ్రీకృష్ణుడిని వేడుకుంటోంది. హృదయపీడను, దేహ తాపాన్ని ఉపశమింపమని అభ్యర్థిస్తోంది. కానీ వైష్ణవ భక్తి భావనతో వింటే, పాట అర్థం మారిపోతుంది. పరమాత్మకు దూరమైన ఆత్మ పరమాత్మలో కలవాలని తపిస్తోంది. ఆ కలయిక ద్వారా జీవితాన్ని సఫలం చేసుకోవాలని ఆరాటపడుతోంది. ఈ పాట మొత్తం అటు శృంగార స్థాయిలో, ఇటు ఆధ్యాత్మిక భావనతో అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ఇది గొప్ప ప్రయోజనం కల ప్రయోగం. సామాన్యులు భౌతిక ప్రేమ భావనతో తాదాత్మ్యం చెందుతారు. భగవంతుడి ప్రేమ కాబట్టి శృంగార భావనలో పవిత్రతనే చూస్తారు తప్ప అమలినపుటాలోచనలు కలగవు. పండితులు ఇతరులు భౌతికభావనను వదలి ఆధ్యాత్మిక భావనల సముద్రపుటలల తాకిడికి ఉక్కిరిబిక్కిరి అవుతారు. ఈ రకంగా సమాజంలో అన్ని స్థాయిలవారిని అలరిస్తాయీపాటలు.

భగవంతుడిని చేరాలన్న భక్తుడి తీవ్రమైన వేదన, ప్రియుడితో కలయిక ద్వారా జీవితాన్ని ఫలవంతం చేసుకోవాలన్న ప్రేయసి తీవ్రమైన తపనద్వారా ప్రతిఫలిస్తుంది ఈ పాట. పాటలో రాధా, కృష్ణులు, సినిమాలో నాయికా నాయకులు, ఆపై స్థాయిలో భక్తుడు, భగవంతుడు.

**కయీ జుగ్ సే హై జాగే, మోరే నైన్ అభాగే**

**కహి జియా నహిలాగే బిన్ తోరే**

**సుఖ్ దేఖె నహి ఆగే, దుఖ్ పీఛే పీఛే భాగే**

**జగ్ సూన సూన లాగే బిన్ తోరే**

ఎన్నో ఏళ్లనుంచి ఆమె అతని కోసం ఎదురు చూస్తూ నిద్ర మరచింది. ఆమె కళ్లు అతనికోసం ఎదురు చూస్తూనే ఉన్నాయి. 'మెరె నైన్ అభాగే' ఆమె కళ్లు ఎంతో దురదృష్టమైనవి. భాగ్యం లేనివి. అతడిని చూడలేకపోతున్నాయి. అతడు లేకుండా ఆమె మనస్సు ఎక్కడా శాంతంగా ఉండలేక పోతోంది. ఏ పనిపైనా ఏకాగ్రత నిలవటంలేదు. ఈ రకమైన అశాంతి, ఎక్కడా మనసు నిలవలేకపోవటం, ఏ పనీ చేయలేకపోవటం, రాత్రంతా నిద్రలేకపోవటం, ప్రియుడిని చూడాలని తపించటం ఇదంతా ప్రేమలో ఉన్నవారికి అనుభవమే. ఈ ప్రపంచంలో ప్రతి ప్రాణి సుఖం కోసం అన్వేషణలో దుఃఖాన్ని అనుభవిస్తుంది. సుఖం కనుచూపుమేర కనబడదు. కానీ దుఃఖం వెంటపడుతుంది. భగవదన్వేషణ కోసం లభించిన జన్మ, సుఖాన్వేషణలో దారి తప్పి దుఃఖమయం అవుతుంది. మరీచికల వెంటబడి జీవితం వ్యర్థం అవుతుంది. ఇలాంటి పరిస్థితులలో ప్రాణికి ఉపశమనం కలిగించేది ప్రేమసుధా వర్షమే!

**ప్రేమ సుధా, మోరె సాంవరియా**

**ప్రేమ్ సుధా ఇత్‌నీ బర్సాదో, జగ్ జల్ థల్ హోజాయే..**

ఓనా ప్రియుడా, ప్రేమ సుధను ఎంతగా వర్షిస్తావంటే ఈ ప్రపంచం సర్వం ప్రేమ సుధా వర్షంలో తడిసి ముద్దయిపోవాలి.

పాటంతా ఒక ఎత్తు, ఈ రెండు పాదాలు ఒక ఎత్తు.

'ప్రేమ్ సుధా' అని రాగం తీసి, 'మోరెసావరియా.. సావరియా' అంటూ గొంతెత్తి రాగం తీస్తూంటే అంత వేదన, అంత ఆర్తి, అంత ప్రేమ తీవ్రత, అంత మాధుర్యం, మనసు భరించలేదనిపిస్తుంది. ముఖ్యంగా గీతాదత్ స్వరంలో అంతర్గతంగా ఉన్న ఆవేదన మనసు లోలోతుల్లో అణగి ఉన్న ఆవేదనలను, బాధలను పైకి ఉబికి ఉబికి తెస్తూ మనసును ప్రక్షాళన చేస్తున్న భావన కలుగుతుంది. ఆమె రాగంతోపాటూ మనసు ఏవేవో దూరతీరాలకు ప్రయాణిస్తుంది. అలవికాని ఆనందం కలుగుతుంది. మనసులోంచి వేదన చీకటిని తొలగిస్తూ ఆనందపు రోచిస్సులు ప్రవహిస్తున్న భావన కలుగుతుంది. సావరియా అని రాగాలు తీస్తూ, బ్రతిమిలాడుతూ 'ప్రేమ్ సుధా ఇత్నీ బర్సాదో' అని అభ్యర్ధిస్తూంటే, పాట మాధుర్యానికి ప్రాణాలు కరిగిపోవటం అనుభవానికి వస్తుంది. మళ్లీ 'ఆజ్ సజన్' దగ్గరకు వచ్చే వరకూ ఊపిరి కూడా తీయలేనంత మధుర భావనతో ఉక్కిరిబిక్కిరి అయిపోతాం. ఇక తరువాత చరణం, ఢోలక్ గమనం, పాటపాడిన విధానం, పదాలు, వాటి భావం స్వచ్ఛమై, ప్రేమమయమై, భగవంతుడి అనంతమైన అతి సుందరమైన నయనాలు వర్షించే ప్రేమ కృపారస ధారలో కొట్టుకుపోయేట్టు చేస్తుంది. పాడుతున్న గాయని స్వరప్రవాహం, అమృత ప్రవాహమై, ఆనంద కెరటాలపై తేలియాడ చేస్తూ భక్తి మహా సముద్రంలో ప్రయాణింపచేస్తుంది.

**మొహె ఆప్ న బనాలో మోహె బాహ పకడ్**

**మై హూ జనమ్ జనమ్ కీ దాసీ...**

ఒళ్లు గగుర్పొడుస్తుంది. ప్రేమ భావనలోని సర్వసమర్పణ, అంకిత భావన, తనను తాను కోల్పోయి సర్వం పొందటం, అహాన్ని ఆవిరి చేసి విశ్వ విభునిలో లయమై పోవటం వంటి అనేకానేక భావనలు ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. 'నన్ను నీదాన్ని చేసుకో, నాయీ చేయిని గ్రహించు. నేను నీ జన్మజన్మల దాసిని. 'మై హూ జనం జనం కీ దాసి '.. అద్భుతం అనిపిస్తుంది. ఇక ఈ పాదం దాటి పాట వినటం దుర్లభం అనిపిస్తుంది. కళ్లు చెమ్మగిల్లుతాయి. హృదయం భరించరాని ఆనందంతో కూడిన బాధతో నిండిపోతుంది. భక్తుడు తనని తాను సంపూర్ణంగా భగవంతుడికి సమర్పించుకోటంలోని ఔన్నత్యం, ఉత్కృష్ట భావనలు బోధపడతాయి. 'మై హూ జనమ్ జనమ్ కీ దాసి'

కనిపెంచి విద్యాబుద్ధులు చెప్పించిన తల్లితండ్రులను గౌరవించి, వారి మాట వినటం, ఆత్మగౌరవానికి భంగంగా, వ్యక్తిత్వహననంగా భావించే సమాజానికి 'జనమ్ జనమ్ కీ దాసీ' అంటే అణచివేత తప్ప అహంలేని సమర్పణ అన్న భావన అర్ధం కాకపోవటంలో ఆశ్చర్యం లేదు.

ప్రతి విషయాన్ని వక్రంగా సిద్ధాంత చట్రంలోంచి మాత్రమే చూడగలిగే సంకుచిత దృష్టి సమాజానికి 'జనమ్ జనమ్ కీ దాసి'లో అణచివేతలు, కుట్రలు, కుతంత్రాలు తప్ప ఇహలోకాన్ని మరచి, అహాన్ని విడిచే సంపూర్ణ సమర్పణ 'జనమ్ జనమ్ కీ దాసీ' అన్న భావన ఊహకు కూడా అందదు.

'జనమ్ జనమ్ కీ దాసీ' అన్న పదాలలో గీతాదత్ చిలికించిన సంపూర్ణ సమర్పణ భావనను అనుభవించాల్సిందే. మాటలలో చెప్పటం కుదరదు. ఆ భావనను వర్ణించటానికి పదాలు లేవు. ఆ భావనను పదాలలో ప్రదర్శించాలని ప్రయత్నించటమే అపవిత్రమైన ఆలోచన అనిపిస్తుంది.

**మోరి ప్యాస్ బుఝాదో, మన్ హర్ గిరిధర్**

**ప్యాస్ బుఝాదో, మన్ హర్ గిరిధర్**

**మై హూ అంతర్ ఘట్ తక్ ప్యాసీ..**

'జనమ్ జనమ్ కీ దాసీ' కన్నా ఆధ్యాత్మికపుటెత్తులు ఎదగలేదీ పాట అనుకునేంతలో , 'అంతర్ ఘట్ తక్ ప్యాసీ' అంటూ ఆధ్యాత్మికపు లోతుల్లోకి లాక్కు వెళ్తుంది ఈ పాట.

'నన్ను నీ దాన్ని చేసుకో. నేను నీకు దాసిని' అంటూనే 'నా దాహం తీర్చు. మనోహరా, గిరిధిరా నా శరీరం అణువణువుతో నీ కోసం తపిస్తున్నాను' అంటుంది.

'అంతర్ ఘట్' అన్నది అద్భుతమైన పదం.

**ఇస్ ఘట్ అంతర్ బాగ్ – బగీచే, ఇసీమే సిరజ్ నహార!**

**ఇస్ ఘట్ అంతర్ సాత్ సముందర్, ఇసీమె సౌలాఖ్ తారా!**

**ఇస్ ఘట్ అంతర్ పారస్ మోతీ, ఇసీమె పరఖన్ హారా!**

**ఇస్ ఘట్ అంతర్ అనహద్ గరజౌ, ఇసీమె ఉఠత్ పుహారా!**

**కహిల్ కబీర్ సునోభాయి సాధూ, ఇసీమే సాయీ హమారా!**

'ఘట్' అంటే ఘటం అన్నది సామాన్యార్ధం. కలశం అన్నది మరో అర్ధం ఇదొక వాయిద్యం కూడా. 'ఘట్' అంటే పిండం, శరీరం అన్న అర్థాలున్నాయి. 'ఘట్' అంటే మనస్సు, హృదయం అన్న అర్థాలున్నాయి. 'అంతర్యామీ ఘట్ ఘట్ బాసీ' అంటే, హృదయం నిండా భగవంతుడు నిండి ఉన్నాడు అన్నది అర్ధం.

కబీర్ 'ఘట్ ' అన్న పదాన్ని అతి సుందరంగా వాడాడు.

ఈ ఘటంలోనే తోటలున్నాయి. పూలు పూచాయి. ఈ ఘటంలోనే అతని సృజన ఉంది. ఈ ఘటంలోనే సప్తసముద్రాలున్నాయి. దీన్లోనే లక్షల సంఖ్యలో నక్షత్రాలున్నాయి. ఇందులోనే బంగారం ఉంది ముత్యాలున్నాయి. ఇందులోనే 'సాక్షి' ఉన్నాడు. ఈ ఘటంలోనే మన ప్రభువు ఉన్నాడు. ఇక్కడ ఘటం శరీరానికి ప్రతీక. మరో స్థాయిలో విశ్వానికి ప్రతిబింబం.

'సాయి' అంటే సాయిబాబా తప్ప ఎవరూ గుర్తుకు రాని దుస్థితి ఇప్పుడు ఉంది. కానీ ఒకప్పుడు, కబీర్ కాలంలో, 'సాయి' అంటే ప్రభువు,భగవంతుడు, దైవం అన్న అర్ధాలే ఉండేవి.

కబీర్ 'ఘట్' అన్న పదాన్ని సకల విశ్వాన్ని సూచించేందుకు వాడేడు. ఈ విశాల దృక్పథంతో చూస్తే 'అంతర్ ఘట్ తన్ ప్యాసీ' అంటే ఆమె మనస్సు, హృదయమే కాదు శరీరం అణువణువూ అతనికోసం తపిస్తూన్నది అని అర్ధమవుతుంది. భక్తుడు భగవంతుడి కోసం తపించాల్సిన తీవ్రత ఇది. 'అంతర్ ఘట్ తక్ ప్యాసీ'

ఇటీవలి కాలంలో నాస్తికత ముసుగులో దైవదూషణ ఒక అలవాటైపోయింది. భారతీయ ధర్మాన్ని దూషించి, హేళన చేసి, తీసి పారేయటం ఒక ఫాషన్ అయింది. 'దేవుడు విగ్రహంలో ఉన్నాడా?', పూజలో ఉన్నాడా? నీళ్లల్లో మునిగితే పాపం పోతుందా? లాంటి వాదనలు గొప్పగా చేస్తున్నారు కాని భగవంతుడి భావన అర్ధం కావాలంటే 'అంతర్ ఘట్ తక్ ప్యాసీ' అన్న భావనను అనుభవించాలి.

**ఎక్ కహత్ హై భగవాన్ ఆతే నహీ**

**తుమ్ మీరాకి జైసే బులాతీ నహీ**

భగవంతుడు పిలిస్తే రాడని ఎవరుంటారు. 'మీరా' అంత తీవ్రమైన ప్రేమతో పిలిస్తే భగవంతుడు వస్తాడు. అంతటి 'అంతర్ ఘట్ తక్ ప్యాసీ' అన్న తీవ్రమైన తపనను అనుభవిస్తూ పిలిస్తే భగవంతుడు తప్పకుండా వస్తాడు. ఆ భావన

అనుభవానికి వస్తుంది. 'అంతర్ ఘట్ తక్ ప్యాసీ' అంటే శారీరక స్థాయి, దాటి మానసిక లోలోతుల పరిధులు దాటి, భౌతిక స్థాయి దాటి ఇంకా లోలోతుల్లోకి ఆధ్యాత్మిక సముద్రపు లోలోతులవరకూ ఈ తపనను అనుభవించాలి. 'అంతర్‌ఘట్ తక్' భౌతిక పరిధులు దాటిపోవాలి. అప్పుడే ఈ పిలుపు వస్తుంది.

**ప్రేమ్ సుధా ఇత్‌నీ బర్సాదో**

**జగ్ జల్ థల్ హోజాయే..**

'ప్రేమ సుధారస వృష్టి ఎంతగా కురిపిస్తావంటే ప్రపంచంలో ఆ సుధార సువర్షంలో తడిసి ముద్దయిపోవాలి. ఈ తడిసి ముద్ద అవటం శరీర స్థాయికే పరిమితం కాదు. 'అంతర్‌ఘట్' తక్ ఉన్న ప్రేమ దాహార్తిని తీర్చాలి. ముంచెత్తాలి..

ఈ భావన లేకుండా, ఆ ఆర్తి లేకుండా ఎంత ప్రార్థించినా దేవుడు కరుణించడు. 'కనిపించడు కాబట్టి లేదు' అని కొట్టి పారేసే వారిని చూసి  జాలిపడటం తప్ప ఏమీ చేయలేం.

ఈ పాటను పాడటంలో గీతాదత్, రెండవ చరణంలో 'మోహె ఆప్న బనాలో' నుంచి తన స్వరంలో భావాలు పలికించే శక్తి విశ్వరూపం ప్రదర్శిస్తుంది. బెలతనం, బాధ, అభ్యర్థన, ఆశ నిరాశలు.. మన్‌హర్ గిరిధర్, అని రెండోమారు సాగదీసి  అనటం ఎన్ని మార్లు విన్నా తనివి తీరదు. తన స్వర మాయాజాలం సృజించిన ప్రేమ భావన సుడిగుండంలో మునకలేయిస్తూ గిరగిరా తిప్పుతుంది. ఈ పాట చిత్రీకరణ గొప్ప స్థాయిలో ఉంటుంది. నాయిక పాత్రకు  నాయకుని పట్ల ఉన్న భక్తి భావనను, ఆరాధనను చక్కగా చిత్రీకరిస్తారు. కానీ పాట భావం అనుభవించి ఆధ్యాత్మిక భావనల సుధారస వర్షంలో తడిసిముద్ద అయిన తరువాత చిత్రీకరణ, నటీనటుల నటన, లైటింగ్ వంటి విషయాల గురించి చర్చించటం అప్రియంగా అనిపిస్తుంది.అప్రస్తుతం అనిపిస్తుంది. పాటను అనుభవిస్తూ భౌతిక స్థాయి దాటి ఆధ్యాత్మికపుటాకాశంలో విహరిస్తున్న మనసు మళ్ళీ మామూలు భూమికి దిగిరానంటుంది.

సాంప్రదాయిక భావనలు, జానపద బాణీలు, పల్లె ప్రజల జీవితాలను వెలిగించే వాయిద్యాల రాగాలతో సినీగీతాల స్థాయిని పెంచిన ఆనాటి కళాకారుల  ఋణం ఎలా తీర్చుకోవాలో అర్థంకాదు. అనన్య సామాన్యమైన ఆధ్యాత్మిక భావనలను, సామాన్య ప్రజలకు అమృత గుళికలలాంటి గీతాల రూపంలో, శివుడి జటాజూటంలో వొదిగిన ద్యోమార్ఝురిని మానవాళికి మోక్షం అందించటంకోసం భూమిపైన గంగలా అవతరింపచేసిన భగీరధుడిలా,  ఆనాటి

కళాకారులు, ఇలాంటి గంగలాంటి పవిత్రమైన గీతాలను అందించి ధన్యులయ్యారు. మన జీవితాలను ప్రేమ సుధారస వృష్టిలో ముంచెత్తుతున్నారు తమ సినీగీతాలద్వారా.

'ఆజ్ సజన్' పాట భారతీయ ఆధ్యాత్మికపుటాలోచనలకు, ఆశలకు, జీవన విధానానికి దర్పణం పడుతుంది. ఆనాడు ఇలాంటి గీతాలు పాడుతూ వీధుల్లో తిరుగుతూ ప్రజలకు జ్ఞానబోధ చేసేవారు ఉన్నత భావాలను సామాన్య ప్రజానీకం వరకూ విస్తరింపచేసేవారు. ఇదీ ఆద్యంతాలు లేని భారతీయ సమాజ స్వరూపం. ఇక్కడ భౌతిక విషయాలకు ప్రాధాన్యం లేదు. ప్రపంచంలో ఎవరి దగ్గరా లేనంత ధనం ఉన్నవాడు కూడా ఒళ్లంతా బూడిద పూసుకుని దిగంబరంగా నిలచి భగవధ్యానంలో సర్వం మరచిన వాడి ముందు మోకరిల్లుతాడు. రాజాధిరాజులు, వీరాధివీరులు, చక్రవర్తులు కూడా రాయిలో పరమాత్మను దర్శించి, అనుభవించి, పలవరించి, 'అంతర్‌ఘట్' వరకూ విస్తరించి ఉన్న తమ ఆధ్యాత్మిక దాహాన్ని ప్రేమ సుధ వర్షపు బిందువులతో తీర్చుకోవాలని తపిస్తారు. ఇదే జీవిత లక్ష్యం . ఇదే మానవ జీవిత పరమార్ధం, మానవుడి పరమ గమ్యం ఇదే.

**ఆజ్ సజన్ మోహె అంగ్ లగాలో, జనమ్, సఫల్ హోజాయే**

**హృదయ్‌కి పీడా, దేహకి అగ్ని సబ్ శీతల్ హో జాయే.**

మరిన్ని మధురమైన పాటలతో వచ్చేనెల

Click here to share your comments